క్లుప్తంగా

18న నృసింహునికి చందనాలంకరణ

రాపూరు: పెంచలకోనలో స్వయంభువుగా వెలసిన పెనుశిల లక్ష్మీనరసింహస్వామి మూల మూర్తి 18వ తేదీన చందనాలంకరణలో దర్శన మివ్వనున్నట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. మంగళవారం స్వాతి నక్షత్రం స్వామి వారి జన్మనక్షత్రం కావడంతో స్వామివారికి ఉదయం 4గంటలకు సుప్రభాతం, 9 గంటలకు శాంతిహోమం, 10గంటలకు కల్యాణం రాత్రి 7 గంటలకు బంగారు గరుడసేవ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కండలేరులో 6.525 టీఎంసీలు

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం 6.525 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. హెడ్ రెగ్యులేటర్ నుంచి సత్యసాయిగంగకు 15 క్యూసెక్కులు, పిన్నేరువాగుకు 40, లోలెవల్ కాలువకు 40 క్యూసెక్కుల వంతున నీటిని విడుదల చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

విద్యుత్ తీగ తగిలి గొర్రె మృతి



మృతిచెందిన గొర్రె

గూడూరురూరల్: తెగిపడిన విద్యుత్ తీగ తగిలి ఓ గొర్రె మృతిచెందింది. పోటుపాళెం గ్రామానికి చెందిన గొర్రెల కాపరి గ్రామ సమీపంలో ఉన్న లే అవుట్‌లోకి ఆదివారం గొర్రెలను మేతకు తీసుకుని వెళ్లాడు. అక్కడ ఓ విద్యుత్ తీగ తెగిపడి ఉంది. అటు వైపుగా వెళ్లిన గొర్రె విద్యుత్ తీగ తగిలి అక్కడికక్కడే విద్యుత్ షాక్‌తో మృతిచెందింది. గమనించిన కాపరి విద్యుత్ శాఖాధికారులకు పలుమార్లు ఫోన్‌లు చేసినా సాయంత్రం వరకు పట్టించుకోలేదని గొర్రెల కాపరి ఆవేదన వ్యక్తం చేశారు. రూ.10 వేల విలువ చేసే గొర్రె మృతి చెందిందని, అదే అటువైపు ఎవరైనా తీగను గుర్తించిక వెళ్లి ఉంటే వారి ప్రాణాలు పోయి ఉండేవని స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి విద్యుత్ తీగలను సరిచేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పీఏసీఎస్ అధ్యక్షుల రాజీనామా

ఓజిలి: మండలంలోని కురుగొండ, కుందాం పీఏసీఎస్ అధ్యక్షులు ఉచ్చూరు శోభారాణి, ఎద్దల రాజారామిరెడ్డి తమ పదవులకు రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను సీఈఓలు రవీంద్రయ్య, సుధాకర్‌రెడ్డికి ఆది వారం అందజేశారు. మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య సహకారంతో గత 4 సంవత్సరాల 8 నెలలు అధ్యక్షులుగా పనిచేశారు. రైతులకు విత్తనాలు, ఎరువులు అందించి వారి సంక్షేమానికి కృషిచేశారు. వైఎస్సార్ సీపీ పార్టీ కోసం కష్టపడి పనిచేస్తామని తెలిపారు.

నృత్య విద్యార్థులకు సన్మానం



పూరీలో నృత్య విద్యార్థులను సత్కరిస్తున్న అకాడమీ అధ్యక్షుడు లలితారావు

గూడూరురూరల్: పట్టణంలోని శివలలిత భరత నాట్య మండలి విద్యార్థులకు ఒడిశాలోని పూరిలో ఆదివారం ఘన సత్కారం లభించినట్లు నృత్య గురువు పిండి మల్లిక తెలిపారు. గూడూరులోని శివ లలిత నాట్య మండలిలో నృత్యం నేర్చుకునే విద్యార్థులు కొంత కాలంగా పలు రాష్ట్రాలలో నృత్య ప్రదర్శనలు ఇస్తున్నారన్నారు. ఈక్రమంలోనే ఒడిశాలోని పూరీజగన్నాథుని సమక్షంలో భారత్ ఆర్ట్స్ అకాడమీ వారు పలు ప్రాంతాలకు చెందిన కళాకారులతో నృత్య ప్రదర్శనలు ఏర్పాటు చేశారని తెలిపారు. వారిలో గూడూరుకు చెందిన లలిత భరత నాట్య మండలి విద్యార్థులు మంచి ప్రతిభ కనబరచడంతో ప్రతిఒక్కరికి సర్టిఫికెట్లు ఇవ్వడంతో పాటు నృత్య గురువులు మల్లిక, వెంకయ్యలను ఘనంగా సత్కరించారు. ఈక్రమంలో గూడూరులో కూడా పలువురు వీరికి అభినందనలు తెలిపారు.

ఘనంగా గంగమ్మ తిరునాళ్ల



పోతురాజు, గంగపెట్టె, కలశాల ఊరేగింపు

సత్యవేడు: మండలంలోని నరసరాజు అగ్రహారంలో మూడురోజుల పాటు గంగమ్మ తిరునాళ్లు నిర్వహించనున్నారు. 9, 10, 11 తేదీల్లో తిరునాళ్ల నిర్వహిస్తారు. ఆదివారం ఉదయం 8 గంటలకు గ్రామంలో పోతురాజు ముందు నడువగా అంకమ్మ గంగపెట్టె, చెల్లాతమ్మ కలశం, అంకమ్మ కలశాలు వీధుల్లో ఊరేగింపుగా తీసుకుని గంగమ్మ గుడి వద్దకు వెళ్లారు. పోతురాజు గంగమ్మ పెట్టె, కలశాలకు ఇంటింటా భక్తులు కొబ్బరి కాయలు కొట్టి, పసుపునీళ్లు చల్లి మొక్కులు చెల్లించుకొన్నారు. మధ్యాహ్నం రెండు గంటలకు కలశ స్థాపన నిర్వహించారు. మధ్యాహ్నం మూడు గంటలకు పుట్ట బంగారం తెల్చి హోమం, గణపతి పూజలు చేశారు. సాయంత్రం 6 గంటలకు వీధుల మలుపుల వద్ద రక్షాబంధనం (కాపు కట్టుట) కట్టారు.

చేనుకు రక్ష.. భూసార పరీక్ష





మట్టి నమూనాలను సేకరిస్తున్న వ్యవసాయాధికారులు (ఫైల్), రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయశాఖ అధికారులు (ఫైల్)

డక్కిలి: భూసారం ఎప్పుడూ ఒకేలా ఉండదు. వేసే పంటలు, వాడే ఎరువులు, క్రిమిసంహారక మందులను బట్టి మారుతూ ఉంటుంది. ఆ మార్పులను ఎప్పటికప్పుడు కనిపెట్టి పంటలు సాగు చేస్తేనే మంచి దిగుబడులు వస్తాయి. అందుకోసం పంటల సాగుకు ముందు విధిగా భూసార పరీక్షలు చేయించుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. దీంతో ఎరువులకు పెట్టుబడులు తగ్గించుకోవడంతోపాటు అధిక దిగుబడులు సాధించుకోవచ్చునని చెబుతున్నారు.

వెంకటగిరి వ్యసాయశాఖ ఏడీఏ పరిధిలో డక్కిలి, బాలాయపల్లి, వెంకటగిరి రూరల్ మండల పరిధిలో సాధారణంగా రబీలో 40వేల ఎకరాలు, ఖరీఫ్ సీజన్‌లో 20వేల ఎకరాల్లో పంటలు సాగు చేపడుతుంటారు. రైతులు భూమిలోని పోషకాలను తెలుసుకోకుండానే పంటలకు విచ్చలవిడిగా అన్ని రకాల ఎరువులను వాడుతుంటారు. ఫలితంగా ఎరువుల పెట్టుబడి తడిచి మోపెడవుతోంది. ఈనేపథ్యంలో ఎరువుల భారాన్ని తగ్గించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా క్షేత్ర స్థాయిలోని వ్యవసాయాధికారులు మట్టి నమూనాలను సేకరించి భూసార పరీక్షలతో భూమిలోని పోషకాలు, పోషకాల లోపం, ఆమ్ల, క్షార స్థితి, చౌడు తెలుస్తాయి. అందుకనుగుణంగా పంటకు ఏఏ ఎరువులు..ఎంత మోతాదులో వినియోగించాలో సూచిస్తున్నారు. దీంతో రైతులకు ఎరువుల భారం గణనీయంగా తగ్గుతోంది. వ్యవసాయం లాభసాటిగా ఉండాలంటే తక్కువ ఖర్చుతో ఎక్కువ దిగుబడులు వచ్చి ఆదాయం పొందే అవకాశం ఉంటుంది. అలాకాకుండా అధిక దిగుబడులు సాధించే లక్ష్యంతో రసాయన ఎరువులు, పురుగులమందులు అవసరానికి మించి వినియోగించడంవల్ల భూమిలోని పోషకాలు నశిస్తాయి. దీంతో పత్రజని తగ్గి భూమి ఉత్పాదకశక్తిని కోల్పోయి చౌడుబారడంతో పాటు చీడ పీడల ఉధృత, వాతావరణ కాలుష్యం వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. ఈ కారణంగా రైతులు నష్టపోయే ప్రమాదం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు.

నమూనాలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

- రబీ పంట కోతలు పూర్తయిన తరువాత వేసవిలో మట్టి నమూనాలు సేకరించాలి.
- పొలాలకు సాగునీరు పెట్టినప్పుడు, ఎరువులు వేసిన తరువాత నమూనాలు సేకరించకూడదు.
- పొలాల్లో గట్లు, చెట్లు ఉన్న ప్రాంతాల్లో మట్టి నమూనాలు తీసుకోకూడదు. ముందుగా నేలపై ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసివేయాలి.
- పొలంలో 15 నుంచి 20 మీటర్ల లోతున పారతో గుంతతీసి పైపార నుంచి కింది వరకూ మట్టిని సేకరించాలి. ఎనిమిది ప్రదేశాల్లో సేకరించిన మట్టిని పట్టపై పోసి బాగా కలిపి అరకేజీ మట్టిని తీసుకుని నీడలో ఆరబెట్టాలి. మట్టి బాగా అరిన తరువాత పాలిథిన్ కవర్‌లో నింపి రైతు వివరాలు, సర్వే నంబర్, విస్తీర్ణం, గతంలో సాగు చేసిన పంట వివరాలను నమోదు చేసి భూసార పరీక్ష కేంద్రానికి పంపాలి.
- వ్యవసాయ పంటలు పండించే భూముల్లో 6 అంగుళాల లోతు నుంచి నమూనా సేకరించాలి. పండ్ల తోటలకు మూడు అడుగుల లోతులో ప్రతి ఆరు అంగుళాలకు ఒక నమూనా తీయాలి. వ్యవసాయ క్షేత్రాల్లో సేకరించిన మట్టిని ప్రయోగశాలకు తరలించి వివిధ భౌతిక రసాయన పద్దతులు ద్వారా విశ్లేషించి నేల స్వభావాన్ని, లక్షణాలను తెలియజేస్తారు. ఆయా భూముల్లో లవణాల సాంద్రత, నేల, ఆమ్ల, క్షార గుణాలు, పోషకాల స్థాయిని విశ్లేషంచి వాటి ఫలితాల ఆధారంగా సాగు చేయాల్సిన పంటలు, వినియోగించే ఎరువుల మోతాదును సూచిస్తారు. దీంతో సాగు ఖర్చు తగ్గించుకోవడంతో పాటు అధిక దిగుబడులు సాధనకు అవకాశం కలుగుతోంది. వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గి, దిగుబడులు పెరగాలంటే భూసార పరీక్షలు కీలకమని వ్యవసాయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు.

భూసార పరీక్షలు తప్పనిసరి..



పంటసాగుకు ముందుగా భూసార పరీక్షలను రైతులు తప్పనసరిగా చేయించుకోవాలి. భూమిలో లోపించిన పోషకాలను గుర్తించవచ్చు. అందుకనుగుణంగా ఎరువులను వినియోగించడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గించుకునే వీలు కలుగుతుంది. పంటలకు అవసరమైన పోషకాలను రసాయ రూపంలో కంటే సేంద్రియ, జీవన ఎరువుల రూపంలో అందించడం ద్వారా ఖర్చులు తగ్గించుకుని నాణ్యమైన దిగుబడులు పొందవచ్చు.

– నాగార్జునసాగర్, వ్యవసాయశాఖ ఏడీఏ వెంకటగిరి

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధన మహోత్సవాలు



గురువులకు పూజలు చేస్తున్న భక్తులు

వాకాడు: మండలంలోని గొల్లపాళెంలో విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయంలో రెండు రోజులుగా ఆరాధన మహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా శని వారం రాత్రి ఆలయం వద్ద దాతల సహకారంలో అన్నదానాలు, పలు ప్రాంతాలకు చెందిన వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయాల గురువులు, భక్త బృందాలచే భజన కార్యక్రమాలు, మంత్రోపదేశం, ఉపన్యాసాలు నిర్వహించారు. అలాగే ఆదివారం తెల్లవారుజామున బోధ గురువులకు పాద పూజా కార్యక్రమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో చిత్తూరు కలెక్టర్



ఆలయ ధ్వజస్తంభం వద్ద చిత్తూరు కలెక్టర్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుని ఆదివారం చిత్తూరు జిల్లా కలెక్టర్ షణ్మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ అధికారులు పాల్గొన్నారు.

చిన్నారులకు డ్రాప్స్ వేస్తున్న వైద్య సిబ్బంది(ఫైల్)




గర్భిణులకు టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది (ఫైల్)



ఆరోగ్యమస్తు

- తల్లి, బిడ్డల సంరక్షణే ధ్యేయం
- ఎంసీపీ కార్డులతో ప్రయోజనం
- చిన్నారులకు టీకాల రక్షణ



గర్భిణులకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు అరాఫత్ (ఫైల్), మాతా శిశు సంరక్షణ (ఎంసీపీ) కార్డు

చిల్లకూరు: మాతాశిశు మరణాలను తగ్గించేందుకు గత ప్రభుత్వం వైద్య ఆరోగ్యశాఖలో సమూల మార్పులకు శ్రీకారం చుట్టింది. ఇందులోభాగంగానే అన్ని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలలో వైద్యసిబ్బంది, మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంది. మహిళలకు ఆరోగ్య రక్షణే ధ్యేయంగా సులభతర ప్రసవాలు జరిపేందుకు సత్వర చర్యలు తీసుకుంది. తల్లి, బిడ్డల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా గర్భిణులు, బాలింతలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, చిన్నారులకు సకాలంలో వేయాల్సిన టీకాలతో కూడిన విలువైన సమాచారం తెలుసుకునేందుకు మాతా శిశు రక్షణ(ఎంసీపీ) కార్డులను అందిస్తుంది. పీహెచ్‌సీ పరిధిలో క్షేత్ర స్థాయి సిబ్బంది వాటిని అందజేస్తున్నారు.

సులభంగా ఉంటుంది..

గర్భం దాల్చిన నాటి నుంచి బిడ్డ పుట్టే వరకు తీసుకోవల్సిన జాగ్రత్తలు, సాధారణ వైద్యపరీక్షలు, రక్త పోటు, మూత్ర పరీక్షలు చేసుకోవాల్సిన సమయాలను నిరక్షరాసుల వారు కూడా తెలుసుకునేలా కార్డులలో పొందుపరిచారు. అలాగే అనారోగ్యానికి గురైతే చికిత్స చేయించుకోవాల్సిన విధానం, సులభతరంగా తెలుసుకునేందుకు కార్డులో సమాచారాన్ని ముద్రించారు. గర్భిణులు, ఆరోగ్యభద్రతకు ఈ కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయని పలువురు అంటున్నారు. ప్రధాన మంత్రి మాతృత్వ సురక్ష యోజన, జననీ సురక్ష యోజన, ప్రధాన మంత్రి మాతృత్వ వందన యోజన, ప్రభుత్వ ఆస్పత్రులలో కాన్పులు చేయించుకుంటే ఇచ్చే ఆర్థిక సాయం వంటి పథకాలను అమలు చేస్తున్నారు.


ఎంసీపీ కార్డుల్లో సమాచారం..

అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారుల వరకు సాధారణంగా వ్యాధి నిరోధకశక్తి తక్కువగా ఉంటుంది. దీంతో ఆయా చిన్నారులకు ఇన్‌ఫెక్షన్ సోకి అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది. దీంతో నిర్ణీత సమయానికి టీకాలు వేయించుకునేందుకు ఎంసీపీ కార్డుల్లో నిర్ణీత గడువు సమాచారాన్ని రూపొందించారు. దీంతో తమ బిడ్డల ఆరోగ్యాన్ని సంరక్షించేకునేందుకు పూర్తి సమాచారాన్ని ప్రతి తల్లి తెలుసుకోవచ్చన్న అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు.

ఎంసీపీ కార్డు వినియోగం అత్యంత సురక్షితం..

- ఆరోగ్యసిబ్బంది అందించాల్సిన సేవల వివరాలతో పాటు, వ్యాధి లక్షణాలును తెలియజేయడం
- గర్భాశయం, రొమ్ము కేన్సర్ లక్షణాలు తెలియజేయడం
- సంతాన చికిత్స ద్వారా అందించే చికిత్స విధానంపై అవగాహన కల్పించడం
- తొలి కాన్పులో సాధారణంగా సంభవించే సమస్యల వివరాలను అందించడం
- గర్భిణులు, బాలింతలు, తీసుకోవాల్సిన పౌష్టికాహారం వివరాలు, పిల్లల శారీరక, మానసిక ఎదుగుదల గురించి తెలుసుకోవడం
- ఐరన్, ఫోలిక్ యాసిడ్ మాత్రల ప్రాధాన్యతను తెలుసుకోవడం

ఎంసీపీ కార్డులో వివరాలు..



మాతాశిశు సంరక్షణ(ఎంసీపీ) కార్డుల్లో తల్లి ఆరోగ్య సంరక్షణతో పాటు బిడ్డలకు ఐదేళ్లు వచ్చే వరకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్‌ల వివరాలు ఎంతగానో ఉపయోగపడతాయి. చిన్నారులకు నెలల వయస్సులో చేయాల్సిన బీసీజీ, ఓపీపీ, హెపటైటిస్, మీజల్స్, విటమిన్-ఏ వ్యాక్సిన్‌లు, కార్డులో సూచించిన విధంగా వేయించాల్సి ఉంటుంది. బిడ్డ ఎత్తు, బరువు, కార్డులో నమోదు చేసి ఉండడంతో ఏవైనా లోపాలు ఉంటే వైద్యులకు తెలియజేసి సరైన వైద్యం పొందవచ్చు.

– అరాఫత్..చిల్లకూరు వైద్యాధికారి

కోలాహలం.. హనుమాన్ శోభాయాత్ర



వెంకటగిరిలో హనుమాన్ శోభాయాత్ర

వెంకటగిరిరూరల్: హనుమాన్ జయంతి వేడుకలు పురస్కరించుకుని విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన హనుమాన్ జయంతి వేడుకలు కోలాహలంగా జరిగాయి. పట్టణంలోని విశ్వోదయ కళాశాల క్రీడా ప్రాంగణం నుంచి త్రిభువని సెంటర్, కాశీపేట, రాజావీధి, పోలేరమ్మ తల్లి ఆలయం మీదుగా పెరుమాళ్లస్వామి దేవస్థానం వరకు భారీ సంఖ్యలో మోటారుసైకిల్లతో శోభాయాత్ర ఘనంగా నిర్వహించారు. శ్రీరాముడు, హనుమాన్ వేషధారణలతో పట్టణ పురవీధుల్లో జై హనుమాన్ అంటూ సందడి చేస్తూ హిందు భక్తిని చాటుకునేవిధంగా శోభాయాత్ర సాగింది. శోభాయాత్రలో ఎటువంటి అవాంచనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా గూడూరు డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి చర్యలు తీసుకున్నారు.

సూళ్లూరుపేటలో..

సూళ్లూరుపేట రూరల్: స్థానిక విశ్వహిందూ పరిషత్ ప్రఖండ ఆధ్వర్యంలో హనుమాన్ శోభాయాత్ర బైక్ ర్యాలీని ఆదివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని రామాలయ బ్రాహ్మణ వీధి, బాలాంజనేయ స్వామి దేవాలయం నుంచి హనుమాన్ చాలీసా పారాయణంతో సాయంత్రం 4గంటల నుంచి 6గంటల వరకు పట్టణ పురవీధుల్లో శోభాయాత్ర వైభవంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని హనుమాన్ చాలీసా పారాయణం చేస్తూ యాత్ర చేశారు. సాయినగర్‌లోని సాయిబాబా మందిరం వద్ద శోభాయత్ర ముగించారు. విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు మురళీరెడ్డి, ఉపాధ్యక్షుడు కమ్మిరెడ్డి, జిల్లా మహిళా ఉపాధ్యాక్షురాలు సుంకర ప్రతిమ, గోపి, కృష్ణారెడ్డి, ఉష, నరేష్ శివప్రసాద్‌రెడ్డి, నారాయణ రెడ్డి, దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు.



సూళ్లూరుపేట: శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

ప్రమాదపుటంచున ప్రయాణం



తనియాలి మార్గంలో కిక్కిరిసిన ఆటో

దొరవారిసత్రం: మండలం పరిధిలోని పలు గ్రామాలకు వెళ్లే ఆటోల్లో ప్రయాణికులు ప్రమాదపుటంచున ప్రయాణం చేస్తున్నారు. సామర్థ్యానికి మించి ఆటోల్లో ప్రయాణికులను ఆటోవాలాలు ఎక్కించి తీసుకెళుతుండడంతో ఎప్పుడు ఏమి జరుగుతుందోనని పలువురు ఆందోళన చెందుతున్నారు. చివరికి బస్ సదుపాయం ఉన్న గ్రామాలకు కూడా ప్రయాణికులు ఆటోల్లో కిక్కిరిసి వెళ్లుతుండడం గమనార్హం. పూలతోట, కట్టువాపల్లి, వేణుంబాకం, తనియాలి, బూదూరు, కల్లూరు, కొత్తపల్లి, వెదురుపట్టు గ్రామాల మార్గాల్లో తిరిగే ఆటోల్లో సామర్థ్యానికి మించి ప్రయాణికులతో తిరుగుతున్నాయి. అధికం ప్రయాణికులతో వెళ్లే ఆటోలు తరచూ ప్రమాదాలకు గురవుతున్నప్పటికీ వాహనదారుల్లో మార్పు రావడంలేదు. దీంతో పాటు ప్రయాణికులు ఏమి పట్టించుకోవడంలేదు. నిబంధనలు అతిక్రమించిన ఆటోవాలాలపై పోలీసులు ఎన్ని జరిమానాలు వేసినా ఏలాంటి ఫలితం ఉండడంలేదనే పలువురు విమర్శిస్తున్నారు.

స్నేహమేరా జీవితం



గురువులను సన్మానించిన కలిచేడు పూర్వ విద్యార్థినీ విద్యార్థులు

- నెల్లూరులో సందడి చేసిన కలిచేడు పూర్వ విద్యార్థులు



1986 బ్యాచ్ విద్యార్థినులు

సైదాపురం: వారంతా చిన్ననాటి స్నేహితులు... ఒకేచోట చదువుకున్నారు..కాలక్రమంలో కొంత మంది ఉద్యోగాల్లో, మరికొందరు వ్యాపారం, ఇతర రంగాల్లో ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. మరికొందరు కాలధర్మం చెందారు. జీవితంలో సుదీర్ఘ ప్రస్థానం అనంతరం వారంతా కలిశారు. జ్ఞాపకాల పూదోటలో విహరించారు. పరస్పర పరిచయాలతో ఫ్లాష్‌బ్యాక్‌లోకి వెళ్లారు. చిన్ననాటి నిక్‌నేమ్స్‌తో పిలుచుకుంటూ సందడి..సందడి చేశారు..వివరాలు..మండలంలోని కలిచేడు గ్రామంలో ఎంఎంఎల్ డబ్ల్యూ హైస్కూల్ 10వ తరగతి చదివిన 1986 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థినీ విద్యార్థులు కాలక్రమంలో నెల్లూరు, చిత్తూరు ఉమ్మడి జిల్లాలలో స్థిరపడ్డారు. సుదీర్ఘ ప్రస్థానం అనంతరం ఆదివారం నెల్లూరులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పలకరింపులు, ఆలింగనాలు నడమ నాటి మధురస్మృతులను నెమరవేసుకున్నారు. ఒకరు తమ కుమార్తెతో, మరొకరు తమ మనవడితో సైతం వచ్చారు. తొలుత తమ సహచరుల్లో కాలధర్మం చెందిన మిత్రుల ఆత్మశాంతికి నివాళులు అర్పించారు. అలాగే తమ ఉన్నతికి బాటలు వేసిన గురుదేవులు హిందీ టీచర్ షేక్ మస్తాన్ సాహెబ్, మ్యాథ్స్ టీచర్ బాలయ్య, తెలుగు పండిట్ డి.రామారావులను శాలువతో ఈ సందర్భంగా ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులందరూ వారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా వయస్సు సంబంధం లేకుండా ఆటపాటలతో సందడి చేశారు. ఈ మధుర జ్ఞాపకాలను తమ సెల్‌ఫోన్లలో నిక్షిప్తం చేసుకున్నారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు శ్రీధర్, ఖాసీం, కొండా సురేష్, పూర్వవిద్యార్థులు కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

ఆర్చరీ పోటీల్లో 'మణి'రత్నం



క్రీడాకారుడు గణేష్ మణిరత్నం

నాయుడుపేటటౌన్ : పట్టణానికి చెందిన గణేష్ మణిరత్నం అనే విద్యార్థి ఆర్చరీ పోటీల్లో సత్తా చాటాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించి కాంస్య పతకం సాధించాడు. ఆదివారం ఈ మేరకు కోచ్ కమల్ కిషోర్ వివరాలు వెల్లడించారు. దక్షిణ కొరియాలో ఈ నెల 3 నుంచి 8వ తేదీ వరకు నిర్వహించిన ఆర్చరీ 2024-ఆసియా కప్‌లో భారత్ తరపున బరిలో దిగిన గణేష్ మణిరత్నం అత్యుత్తమ ఆటతీరును కనబరచినట్లు తెలిపారు. గత ఏడాది సైతం ఐర్లాండ్‌లో జరిగిన ప్రపంచ యూత్ ఆర్చరీ చాపింయన్ షిప్‌లో సైతం రజత పతకం దక్కించుకున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా పతకం సాధించిన గణేష్ మణిరత్నం, కోచ్ కమల్ కిషోర్‌ను ఏపీ ఆర్చరీ సంఘం కార్యదర్శి సత్యనారాయణ అభినందించారు. ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న మణిరత్నం, తల్లిదండ్రు హరిప్రసాద్, సుప్రియకు పలువురు శుభాకాంక్షలు తెలియజేస్తున్నారు.